ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
28-09-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 26 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## మంత్రి పొంగులేటి నివాసంలో
# ఈడీ సోదాలు

**మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఉదయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌లోని పొంగులేటి ఫాంహౌస్, ఆయన బంధువులు ఇళ్లల్లోనూ సోదాలు జరుగుతున్నాయి.**



**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంతో పాటు.. ఆయన సొంత కంపెనీ రాఘవ కన్‌స్ట్రక్షన్స్, ఇన్‌ఫ్రా కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ లోని మంత్రి నివాసం, రాఘవ్ కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లోనూ ఈడీ అధికారులు 16 బృందాలుగా విడిపోయి దాడులు నిర్వహించాయి.
ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంత్రి పొంగులేటి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మంత్రి ఇళ్లల్లో ఢిల్లీ జోనల్ అధికారులు దాడులు

...మిగతాది 2 లో




**హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తూ వాటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అడుగు ముందుకు పడింది. పలు చారిత్రక పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ప్రతినిధులు ముందుకొచ్చారు.**


## పురాతన కట్టడాలను
# పునరుద్ధరణ

**జయభేరి, హైదరాబాద్ :**

CII తెలంగాణ కౌన్సిల్ ప్రతినిధులతో సీఎం సచివాలయంలో సమావేశమయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నగరంలోని పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు ఆయా సంస్థలు ముందుకొచ్చి సీఎం సమక్షంలో పర్యాటక శాఖతో ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వాటి పరిరక్షణ కోసం పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రక భవనాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని, మూసీ ప్రక్షాళన కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసనమండలి కార్యకలాపాలు నిర్వహిస్తామని వెల్లడించారు. జూబ్లీహాల్‌కు చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాలు, హైకోర్టు, సిటీ కాలేజీ, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలన్నారు. నగరంలోని పురాతన మెట్ల బావులను పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్, మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సైన్సెస్ దత్తత తీసుకున్నాయి. సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను భారత్ బయోటెక్ సంస్థ, అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీఆర్టీసీ, కోఠిలోని రెసిడెన్సీ మెట్ల బావిని ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నాయి.


## ప్రభుత్వ పరిహారం
# బ్యాంకుల పాలు

**వరద బాధితుల్ని ఆదుకోడానికి ఏపీ ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం పలు చోట్ల బ్యాంకుల పాలైంది. బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులు కట్టుబట్టలతో మిగలడంతో ఏపీ ప్రభుత్వం ఉదారంగా పరిహారాన్ని ప్రకటించింది. ముంపు గురైన ప్రతి ఇంటికి గరిష్టంగా రూ.25వేల నుంచి రూ.10వేల పరిహారం ప్రకటించింది.**



బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల్ని ఆదుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటిస్తే అది కాస్త బ్యాంకుల పాలవుతోంది. గత రెండ్రోజులుగా ఏపీ ప్రభుత్వం ఆధార్ కార్డుతో లింకైన బ్యాంకు ఖాతాలకు పరిహారాన్ని చెల్లిస్తోంది. ఈ క్రమంలో కొందరు వరద బాధితుల పరిహారాన్ని బ్యాంకులు తమ పాత బాకీల్లో జమ చేసుకుంటున్నాయి. మైనస్ అకౌంట్లలో ఉన్న నగదును బ్యాంకులు మళ్లించుకుంటుండంతో బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. వరద బాధితుల నష్టం గణించినపుడు ఇచ్చిన బ్యాంకు అకౌంట్ ఒకటైతే ఆ ఇంట్లో ఎవరి అకౌంట్లో మైనస్ ఖాతా ఉంటే ఆ ఖాతాలకు

...మిగతాది 2 లో



# హైడ్రా బాధితుల కన్నీటి గాధలు.. ఎవరిదీ పాపం.. ఎందుకీ శాపం?

**హైడ్రా.. ఈ పేరు వింటే ఇన్నాళ్లు అక్రమ కట్టడాలు నిర్మించిన బడా బాబులు భయపడేవారు. ఇప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. తాజాగా.. మూసీ పరివాహక ప్రాంతంలో అధికారులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో ఎందరో కన్నీరు పెట్టుకుంటున్నారు.**

3 లో

**జయభేరి, హైదరాబాద్ :**

చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణ కోసం హైడ్రా పని చేస్తుందని వార్తలు వచ్చినప్పుడు.. మంచిదే కదా అని అందరూ అనుకున్నారు. పెద్ద పెద్ద వ్యక్తుల నిర్మాణాలు కూల్చివేస్తుంటే.. కరెక్టే కదా అని చర్చించుకున్నారు. కానీ ఇప్పుడు ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలు కన్నీరు పెడుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ నగరం చైతన్యపురి మూసీ నది ఏరియాలో అధికారులు సర్వే చేపట్టి..

## గల్ఫ్ బాధిత కుటుంబాలకు
# రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



**జయభేరి, హైదరాబాద్ :**

గల్ఫ్ దేశాల్లో ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసిందన్నారు. గల్ఫ్‌లో పనిచేసే కార్మికుల కుటుంబాల పిల్లల చదువుకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని చెప్పారు. శుక్రవారం బేగంపేట్‌లోని

...మిగతాది 2 లో


# మూసీ టెన్షన్ టెన్షన్..
## కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో ఇప్పుడు ఎక్కడ విన్నా హైడ్రా గురించే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురించి పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చెరువుల దగ్గర నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయమని చెబుతూ హైడ్రా కమిషనర్ కు పవర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. హైడ్రాకు చట్టబద్ధత కల్పించేందుకు కూడా సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే కూల్చివేతలు వద్దని అక్రమ నిర్మాణాల్లో ఉంటున్న ప్రజలు మొత్తుకుంటున్నారు. ఇలా

...మిగతాది 2 లో





# పాక్ నోట మళ్లీ పాతపాట

- ఐరాస వేదికపై కశ్మీర్ ప్రస్తావన
- ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలి
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

**జయభేరి, యునైటెడ్ నేషన్స్:**

ఐక్యరాజ్యసమతి సర్వసభ్య సమావేశంలో పాకిస్తాన్ మరోసారి కశ్మీర్ ప్రస్తావన తెచ్చింది. దీర్ఘకాలిక శాంతి కోసం భారత్ ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని, జమ్మూకశ్మీర్ సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం చర్చలకు రావాలని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. భారత్ తన సైనిక సంపత్తిని భారీగా పెంచుకుంటోందని ఆరోపించారు. ఐరాస

...మిగతాది 2 లో

## కర్నాటక సీఎం సిద్ధరామయ్యపై
# కేసు నమోదు



ముడా స్థల కేటాయింపు కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సిద్ధరామయ్యపై ప్రాసిక్యూషన్ కు గవర్నర్ అనుమతినివ్వడాన్ని కర్నాటక హైకోర్టు సమర్థించిన నేపథ్యంలో, ముడా కుంభకోణంలో లోకాయుక్త విచారణ ప్రారంభమైంది. మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (MUDA) స్థల కేటాయింపు కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతికి ముడా రూ.56 కోట్ల విలువైన 14 స్థలాలను కేటాయించడంలో అక్రమాలు జరిగాయన్న

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఈడీ సోదాలు

నిర్వహిస్తున్నారని.. హైదరాబాద్ జోనల్ అధికారులకు ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. ఇటీవల నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును దక్కించుకున్న రాఘవ నిర్మాణాలపై కాంగ్రెస్ శ్రేణులు, నేతల్లో చర్చ జరుగుతోంది. అయితే.. ఎన్నికల ముందు జరిగిన సోదాలకు తాజాగా చేస్తున్న దాడులు కొనసాగింపు అని అధికారులు చెబుతున్నట్టు తెలుస్తోంది. 2024 తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి కంపెనీ కార్యాలయాలు, ఇళ్లలోనూ ఈడీ సోదాలు నిర్వహించింది. కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అకస్మాత్తుగా సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

**పొంగులేటి కుమారుడి ఆస్తులు..**

హురున్ ఇండియా ప్రకారం.. కేవలం 30 సంవత్సరాల వయస్సులోనే.. కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు పొంగులేటి హర్ష రెడ్డి రూ.1,300 కోట్ల సంపదతో.. హైదరాబాద్‌కు చెందిన అత్యంత సంపన్న వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. రాఘవ కంపెనీ బాధ్యతలు హర్ష చూసుకుంటున్నట్టు సమాచారం.

## ప్రభుత్వ పరిహారం బ్యాంకుల పాలు

నగదు బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంట్లో బాధితులు లబోదిబోమంటున్నారు. కుటుంబంలో డిబిటి మ్యాపింగ్ ఉన్న ఖాతాలకు పరిహారం జమ చేస్తున్నట్టు బ్యాంకులు చెబుతున్నాయి. కొందరికి ఇనాక్టివ్ ఖాతాలు, ఆధార్ కేవైసీ కానీ ఖాతాలకు కూడా పరిహారం జమైన ఉదంతాలు వెలుగు చూశాయి. బుడమేరు వరదల్లో ముంపుకు గురైన బాధితులకు పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. ఈ క్రమంలో పలు జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఈ మొత్తాన్ని పాతబకాయిలు, మైనస్ అకౌంట్లలో జమ చేసుకుంటున్నాయి. బుధవారం నుంచి నగదు చెల్లింపులు మొదలు కావడంతో లబ్దిదారులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ఆ ఖాతాల్లో నగదు పడినా వెంటనే బ్యాంకులకు ఆటోమేటిక్ డెబిట్ కావడంతో తామేమి చేయలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సర్వం కోల్పోయిన బాధితులకు పరిహారం అందకుండా బ్యాంకులు చేయడంపై బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నగదు రాకపోవడంతో బ్యాంకుల వద్ద బాధితులు ఉసురుమంటూ వెనుదిరుగుతున్నారు. ఆధార్ బేస్డ్ పేమెంట్స్ పద్ధతిలో ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. పరిహారం నగదు విషయంలో బ్యాంకులకు సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఈ సమస్యలు తలెత్తాయి. బుడమేరు వరద బాధితులకు పరిహారం చెల్లింపు కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి దాదాపు 536.28కోట్ల రూపాయల పరిహారాన్ని ముంపు బాధితుల ఖాతాలకు ఆధార్ బేస్డ్ చెల్లింపుల ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో చేపట్టారు. గురువారం సాయంత్రానికి మొత్తం 3,71, 302మందికి పరిహారం చెల్లింపుకు ఏర్పాట్లు చేసినట్టు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా హిందుస్తాన్ టైమ్స్‌కు తెలిపారు. మరో రూ.10.69కోట్ల రుపాయల చెల్లింపులు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయన్నారు. 16668మంది బాధితులకు టెక్నికల్ ఇష్యూస్ వల్ల పరిహారం చెల్లింపు జరక బ్యాంకు ఖాతాలకు తిరిగి వచ్చాయని వివరించారు. మొత్తం 3,54,634మంది బాధితులకు రూ. 525.59కోట్ల రుపాయల్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఇలాంటి కుటుంబాలు దాదాపు 80వేల వరకు ఉండొచ్చని సిఎంఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మొదటి అంతస్తులోపు ఉన్నవారికి రూ.25వేలు, మొదటి అంతస్తు ఆపై ఉన్నవారికి రూ.10వేల పరిహారం ప్రభుత్వం ప్రకటించింది. ద్విచక్ర వాహనానికి రూ.3వేలు, ఆటోకు రూ.10వేలు చెల్లించారు. దుకాణాలు, పశువులు, కోళ్లు ఇలా అన్నింటికి లెక్క కట్టి పరిహారం చెల్లించారు. ఇలాంటి కుటుంబాలు 80వేల వరకు ఉండొచ్చని, వరద నష్టం చెల్లింపు పూర్తైన తర్వాత పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.

## రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం..గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న షేక్ హుస్సేన్ కుటుంబం నుంచి మొదటి అభ్యర్థనను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో గల్ఫ్ కార్మికుల కోసం సలహా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య, ఎన్నారై విభాగం సలహాదారుడు బొజ్జ అమరేందర్‌రెడ్డి, ప్రతినిధులు భీంరెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్ రావు, తెలంగాణ ఎన్నారై ఫోరం అధ్యక్షుడు మహ్మద్ జబ్బార్, ఉపాధ్యక్షుడు మహ్మద్ మిస్రీ తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక సీఎంపై కేసు నమోదు

ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు నమోదైంది. సిద్ధరామయ్యపై విచారణ జరిపించాలని బెంగళూరులోని ప్రత్యేక కోర్టు లోకాయుక్తను ఆదేశించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించాలని మైసూరులోని లోకాయుక్త పోలీసులను ఆదేశిస్తూ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రత్యేక కోర్టు మాజీ ఎంపీలు/ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసులను విచారిస్తుంది. ఈ కేసులో సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఇచ్చిన అనుమతిని కర్నాటక హైకోర్టు సమర్థించింది. సాధారణ పరిస్థితుల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 163 ప్రకారం మంత్రిమండలి సలహాలు, సూచనల మేరకు గవర్నర్ వ్యవహరించాల్సి ఉంటుందని, అయితే అసాధారణ పరిస్థితుల్లో గవర్నర్ స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చని, ప్రస్తుత కేసు అలాంటి మినహాయింపును సూచిస్తోందని జస్టిస్ ఎం. నాగప్రసన్నతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ సెప్టెంబర్ 24న తీర్పు వెలువరించింది.

## పాక్ నోట మళ్లీ పాతపాట

సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి షరీఫ్ శుక్రవారం ప్రసంగించారు. ఆర్టికల్ 370, హిజ్బుల్ ముజాహిదిన్ ఉగ్రవాది బుర్హాన్ వనీల ప్రస్తావన తెచ్చారు. 'పాలస్తీనియన్ల లాగే జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా తమ స్వాతంత్ర్యం, స్వీయ నిర్ణయాధికారం కోసం శతాబ్దకాలంగా పోరాడుతున్నారు' అని షహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. కశ్మీరీల అభిమతానికి అనుగుణంగా, ఐరాస భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా జమ్మూకశ్మీర్‌పై భారత్ చర్చలకు రావాలన్నారు. శాంతి ప్రయత్నాలకు భారత్ దూరంగా జరిగిందని ఆరోపించారు. స్వీయ నిర్ణయాధికారం జమ్మూకశ్మీర్ ప్రజల ప్రాథమిక హక్కని, దానిపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని భద్రతా మండలి తీర్మానాలు చెబుతున్నాయని అన్నారు. ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వముండాలనే ప్రతిపాదనకు బ్రిటన్ ప్రధానమంత్రి కియర్ స్టార్మర్ మద్దతు పలికారు. భారత్ డిమాండ్‌కు అమెరికా, ఫ్రాన్స్‌లు ఇదివరకే మద్దతు పలికిన విషయం తెలిసిందే. ప్రపంచ ఐక్యవేదిక మరింత ప్రాతినిధ్యంతో, మరింత స్పందనతో కూడి ఉండాలని స్టార్మర్ ఐరాస సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశిస్తూ అన్నారు.

## మూసీ టెన్షన్ టెన్షన్..

రెండువైపులా ఆయనపై ఒత్తిడి పెరిగింది. ఈ బృందం 1600 అక్రమ నిర్మాణాలను గుర్తించింది. వీళ్లకు హైడ్రా నుంచి నోటీసులు వెళ్లాయనీ త్వరలోనే ఈ భవనాలను కూల్చివేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. ఈ అంశంపై హైడ్రా కమిషనర్ కీలక ప్రకటన చేశారు. కమిషనర్, రాష్ట్రంలో ఎక్కడ ఏ నిర్మాణం కూల్చినా దానికి హైడ్రా కు లింక్ పెడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో శనివారం భారీ కూల్చివేతలకు హైడ్రా సిద్ధమైనట్లు ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. మూసీకి సంబంధించి జరిపిన ఏ సర్వేలోకూడా హైడ్రా భాగం కాలేదన్నారు. అక్కడ ఎవరికీ హైడ్రా నోటీసులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కూకట్ పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కూకట్ పల్లిలోని చెరువుకు దగ్గరలో ఉంటున్న బుచ్చమ్మ, తన కూతుర్లకు కట్నం కింద ఇల్లు ఇవ్వగా..కూల్చివేతల్లో భాగంగా ఆ ఇల్లును కూలుస్తారన్న ప్రచారం జరగడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆత్మహత్యకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులకు సంబంధించి మూసీ రివర్ ఫ్రంట్ ఎండీ దానకిశోర్ ఓ కీలక ప్రకటన చేశారు. ఇళ్లకు పట్టాలు ఉన్నావారు అయితే వెంటనే జిల్లాల కలెక్టర్లను కలవాలన్నారు. తద్వారా ఆ కలెక్టర్లను పట్టాలను పరిశీలించి, పునరావాసం, పరిహారంపై పరిశీలిస్తారని తెలిపారు. పట్టాలు లేని నిరుపేదలైతే..వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇస్తామని ప్రభుత్వం తెలిపింది.

# మత్తు మాటున భ్రష్టుపడుతున్న యువతరం..

## బంగారు భవిష్యత్తు మోయలేని భారం..!?

**బాలల హక్కుల చట్టం పనిచేస్తున్న ఇంకోవైపు రోజురోజుకి యువత మత్తుకు బానిసౌతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. నిషా ముక్తభారత్ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దాని ఫలితం ఎంతవరకు వస్తోంది!? కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చట్టాలు సరిగ్గా పనిచేస్తున్నాయా!? పిల్లలు మత్తు బారిన పడకుండా ఉండడానికి 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సులో వారిని ఎలా మనం నియంత్రించాలి!? కుటుంబం పాఠశాల సమాజం వీటి బాధ్యత ఎంతవరకు ఉంటుంది! అనే విభిన్న విషయలపై యువత బంగారు భవిష్యత్తు, నిషా మత్తు నుండి ఎలా బయటపడాలి అనే విషయంపై "జయభేరి దినపత్రిక" ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న "కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్" సమగ్ర కథనం...**





✍ కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

✍ **జయభేరి, హైదరాబాద్ :**

నిషా ముక్తభారత్ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఒక పథకం. దీని ద్వారా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఇరు రాష్ట్రాల్లో పాటు దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఉన్న యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండడానికి, తీసుకోవలసిన జాగ్రత్తలను అన్నింటిని తీసుకుంటూనే వస్తోంది. కానీ గ్రామీణ మధ్యతరగతి ఎగువ తరగతి ఆయా కుటుంబాల్లో ఉన్న యువత, పిల్లలు పాఠశాల వయసు నుంచే దారి తప్పుతూ మద్యానికి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఇదే ఇప్పుడు ఒకంత కలవరాన్ని తెచ్చిపెడుతుంది. వాస్తవానికి పిల్లల్లో మత్తు పదార్థాలు అలవాటైనప్పుడు దొంగతనం చేయడం, చదువు సరిగ్గా చదవకపోవడం వల్ల ఆలోచనల్లో స్థిరమైన సదాభిప్రాయం లేకపోవడం, కోపం రావడం, తన శరీరం ఒక రకమైన వాసన వస్తుండడం ఇలా కొన్ని ఉదాహరణలు బట్టి పిల్లలు దారి తప్పుతున్నారు అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ఇంకా చెప్పాలంటే ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, ఏ పనైనా చెబితే ఇప్పుడు చేయను, తర్వాత చేస్తాను! అని చెబుతూ మాట దాటి వేయడం, బాధ్యత లేకుండా తిరగడం ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలతో ఉన్నట్టు కనిపిస్తుండడం ఇవి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. పది శాతం మంది బి అడిక్షన్ ఫామ్ కు వస్తున్న మిగతా 80% వారు మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండడానికి ప్రయత్నించడం లేదు. ఎందుకంటే సమాజానికి భయపడి నేను మత్తుపదార్థాలు తీసుకుంటున్నాను అని అందరికీ తెలిసిపోతుంది అనే ఒక ఒకింత అన్యోన్యత భావానికి గురైపోతు నివారణకు దూరంగా ఉంటున్నారు.

వాస్తవానికి మత్తు పదార్థాలకు ఎడిక్ట్ అయిన పిల్లలను చూస్తే వారి కుటుంబాలను గురించి ఒకసారి ఆలోచన చేయాలి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబాల్లో ఎగువ మధ్యతరగతి దిగువ కుటుంబ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తుండడం లేకపోతే భర్త ఒక్కరే పని చేస్తుండడం ఒక కారణమై పోతే నలుగురు కంటే ఎక్కువగా ఉన్న మధ్య తరగతి కుటుంబాల్లో ఒకరితో ఒకరు సంభాషించుకోకుండా చరవాణిలపై ఎక్కువ సమయాన్ని కేటాయిస్తుండడం ప్రతిదీ చూస్తూ వాటిని ఫాలో అవుతుండడం ఆయా కుటుంబాల్లో పిల్లలకు అలవాటుగా మారుతుంది. ఎక్కువసేపు సెల్ ఫోను చూడడం ద్వారా ఆ కుటుంబాల్లోని తల్లిదండ్రులు మందలించడంతో విసుగు కోపం తలుపులు పలగొట్టడం చరవాణి కింద విరగ్గొట్టడం లాంటి మతిలేని పనులు చేస్తుండడం ఈనాటి యువతలు స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇక ప్రభుత్వాలు ఎన్నో పథకాలు తీసుకువచ్చిన సరే మత్తు పదార్థాలను దూరంగా ఉంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో చట్టాలు చేసినప్పటికీ ఇంకా 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వరకు యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. నిజానికి ఇలాంటి ఒక దురదృష్టకరమైన అలవాటు పిల్లల్లో కలగడం ఈ దేశానికి అవమానకరం నష్టం.దేశం అంటే మట్టి కాదు ఈ దేశమంటే మనుషులో అని చెప్పిన మాట పూర్తిగా నేటి యువతరాన్ని చూస్తే మద్యానికి బానిసవడం ఒకవైపు మత్తు పదార్థాలకు లోనై తమ కుటుంబాల్లో విషాదాన్ని కలిగించడమే కాకుండా ఆయా పరిసర ప్రాంతాల్లో సమాజానికి ఒక గుదిబండలు పెట్టుగా మారుతున్నారు. వీరి వల్ల పోలీస్ స్టేషన్లో బాల నేరస్తులు ఎక్కువగా రావడం వారిని మందలించి తిరిగి వదిలేయడం వల్ల పోలీసులంటే భయం లేకుండా పోయింది నేటి మత్తు పదార్థాలకు అలవాటైన యువత తీరు ప్రవర్తన..

మత్తు పదార్థాలకు ఎడిక్ట్ అయిన పిల్లల్లో 13 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు వారి అవతారం చూస్తేనే మనకు వెంటనే అర్థమయిపోతుంది. జుట్టు సరిగ్గా కట్ చేయించుకోకపోవడం సీక్రెట్స్ను మెయింటైన్ చేస్తుండడం ఎవరితోనూ మాట్లాడకపోవడం ఇలా ఎన్నో కారణాలతో పిల్లలు ఒంటరితనానికి అలవాటు పడి డ్రగ్స్ కు అలవాటు పడుతున్నారు. దీని ద్వారా పౌర సమాజం పూర్తిగా పాడైపోయే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే మధ్యతరగతి కుటుంబాల్లో పిల్లలు బాధ పడకూడదు చదువుకోవాలి అని చెప్పి తల్లిదండ్రులు ఇద్దరు పని చేస్తూ వారికి కష్టం అంటే తెలియకుండా గారాబంగా పెంచుతూ అన్ని కుటుంబాల్లో కూడా పిల్లలని సోమరిపోతులుగా తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేయడం వల్ల తోటి స్నేహితులతో పాటు విలాసాలకు విందులకు అలవాటు పడి సరదాగా మొదలైన అలవాటు పూర్తిగా జీవితాన్ని నాశనం చేసే వరకు విడిచి పెట్టకుండా ఉంటుంది. ఈ డ్రగ్స్ ఎక్కువగా అలవాటు పడుతున్న పిల్లల కళ్ళు చూస్తే రెడ్ గా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తాయి. నిజానికి పిల్లలు ఇంట్లో కంటే కూడా ఎక్కువగా పాఠశాల ఆవరణంలో ఉంటున్న సందర్భంలో మనం ఇక్కడ ఒకటి ఆలోచించాలి..

ఇంట్లో కంటే ఎక్కువగా పిల్లలు ఉండేది ఒక పాఠశాలలోనే. అలాంటి పాఠశాలలో అధ్యాపకులు తమ కరికులాన్ని చెబుతూ తమ పనైపోయింది అని అనుకునే విధంగా పనిచేసుకుపోతారే కానీ పిల్లలకు జీవితానికి ఉపయోగపడే ఏ ఒక్క విషయంపై కూడా వారితో మాట్లాడరు సంభాషించారు వారిని మాట్లాడించగలిగే ప్రయత్నం కూడా చేయలేకపోవడం ఒక కారణం చెప్పవచ్చు. అలాగే స్కూలు పరిసర ప్రాంతాల్లో ఆట స్థలం కూడా ఎక్కువగా లేకపోవడం ఇది ఒక కారణం. పిల్లలు ఎక్కువగా స్నేహితులతో తిరుగుతూ సరదాగా అలవాటు చేసుకుంటూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడేలా దోహదం చేసేలా కొత్తకొత్త స్నేహితులను ఎక్కువగా అలవాటు చేసుకుంటారు. ఇలా భారతదేశానికి యువత వెన్నుముక అని చెప్పుకుంటున్న రోజులు ఇకపై ఉండవేమో అన్న అనుమానం కూడా కలుగుతుంది..

దేశానికి యువతే పెట్టుబడి అని ఆనాడు అన్నారు ఏమో తెలియదు కానీ నేడు అదే యువత ఈ దేశానికి ఒక గొడ్డలి పెట్టగా మారుతుంది. ఇది మంచి పద్ధతి కాదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నిషా ముక్తభారత్ పథకాన్ని కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వాలు వీధిగా అమలు చేస్తున్న ఇంకా ఎక్కడో బాధ్యత రహితంగా జరుగుతున్న కార్యక్రమాలను కూడా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు ఎక్కువగా పాఠశాల ఆవరణంలోనే ఉంటారు కాబట్టి పాఠశాలలో పనిచేసే అధ్యాపకులు వారి యొక్క కరికులంతో పాటు జీవితానికి సంబంధించిన ఎన్నో సంగతులను వారితో ముచ్చటిస్తూ వారిని మాట్లాడించగలిగితే జీవితంపై ఒక బలమైన కోరిక కలిగించేలా ఆయా ప్రయత్నాలు స్కూల్ ఆవరణంలోనే ఉపాధ్యాయులు చేయగలిగితే పిల్లల్లో సాధ్యమైనంత వరకు మార్పును కలిగించవచ్చు.

దక్షకు అలవాటు పడిన పిల్లల్లో ఫిజికల్ గా ఎమోషనల్ గా బిహేవియర్ లో చాలా తేడా వస్తుంది. ఫిసికల్గా డ్రగ్స్ గలవాటు పడిన పిల్లలు సీక్రెట్ మైంటైన్ చేస్తూ ఎక్కువగా ఫోన్ ను ఉపయోగిస్తూ ఇంట్లో ఉన్న వస్తువులను కనిపించకుండా చేస్తూ డబ్బులు కూడా మాయం చేసే విధంగా వారి యొక్క ప్రవర్తన మనకు కనిపిస్తూ ఉంటుంది. అలాగే ఏదైనా పని చెబితే విసిగించుకోవడం అరవడం ఇంకా ఒక అడుగు ముందుకేసి పేరెంటును కొట్టే ప్రయత్నానికి కూడా వెనుకాడకుండా డిప్రెషన్ లోకి వెళ్లిపోయి వారి యొక్క శరీరం కూడా వాసన వచ్చే విధంగా తయారవుతుంది. ఇలాంటి కారణాలు కనిపిస్తే వెంటనే బి అడిక్షన్ సెంటర్కు పిల్లల్ని తీసుకువెళ్లి వారిని వారి ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం చేయాలి.

ఇక ఈ సమాజం కూడా నాకెందుకులే అని ఆలోచిస్తూ చూస్తూ అలా వెళ్ళిపోవద్దు కచ్చితంగా రోడ్డు వైపున గాని మనకు తెలిసిన పరిసర ప్రాంతాల్లో కానీ ఇలాంటి పిల్లలు కనపడితే కచ్చితంగా వారిపై చర్య తీసుకునే విధంగా పోలీసులను ఆయా పౌర సంఘాల పెద్దలను సంప్రదించి వారిని అప్పగించే ప్రయత్నం చేయాలి. లేకపోతే ఆయా కాలనీలో ఆయా గ్రామాల్లో పట్టణ పరిసరాల్లో నివసించే పిల్లలు వారు పాడైపోవడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న వారిని సైతం హింసించడం మొదలుపెడతారు. దీని ద్వారా సమాజం తో పాటు దేశం కూడా ప్రమాద స్థితిలో పడిపోతుంది... పూర్తిగా డ్రస్సును అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేసే డ్రగ్స్ మహమ్మారిని ఈ దేశం నుండి తరిమేసేలా ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంట్లో స్కూల్లో కెమెరాలను ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పరీక్షించి తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు ఇటు పౌర సమాజం ముగ్గురు కలిసి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసే అవకాశాలను అందిపుచ్చుకోవాలి.. అప్పుడే బంగారు భవిష్యత్తు పిల్లలకు కలిగించిన వారిమవుతాము...

# రోడ్డే సరిగా వేయలేని ఎమ్మెల్యే పాలన ఏం చేస్తాడు?

- ఎమ్మెల్యే మందుల సామేలు
- ఇటుకుల పహాడ్ కు రోడ్డు వేస్తారా!?
- ప్రజా పాలనలో బహు గొప్పగా పలికితివి కదా...
- మాటలు మూటలకే పరిమితమా..!?
- ప్రజలు ఛీ..కొట్టే వరకు తెచ్చుకుంటారా...!?
- వచ్చే సర్పంచ్ ఎలక్షన్లో కచ్చితంగా ఓటమి తప్పదు!?
- తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మహిళా అధ్యక్షురాలు కే ఇందిరా కృపాకర్...



✍ **జయభేరి, శాలిగౌరారం :**

తెలంగాణ రాష్ట్రంలో దొర పాలనకు చరమ గీతం పాడి, మార్పు కావాలని కోరుకున్న ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. అధికారం దక్కించుకున్న ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేస్తున్న తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మందుల సామేలు మాటలు కోటలు దాటే విధంగా మాట్లాడుతూ... పనులు మాత్రం తూ తూ మంత్రంగానే చేస్తూ వస్తున్నారనిఎద్దేవా చేసారు. దీనికి ఉదాహరణ శాలిగౌరారం మండలంలో ఇటుకుల పహాడ్ గ్రామంలో రోడ్డు అద్వానస్థితికి చేరుకుందని ఎన్నిసార్లు ప్రజలు మొరపెట్టుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజా పాలనలో ఎమ్మెల్యే మందుల సామేలు ప్రజల్ని ఉద్దేశించి ఉప్పొంగే మాటలు మాట్లాడి రోడ్డు వేస్తేనే మళ్ళీ ఊరికి వస్తాను అని చెప్పిన మాటలు ఏమయ్యాయి!? అని నిగ్గదీసి అడిగారు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మహిళా అధ్యక్షురాలు కే ఇందిరా కృపాకర్. ఈ సందర్భంగా **జయభేరి దినపత్రిక**తో ఆమె మాట్లాడుతూ.. శాలిగౌరారం మండలంలో అనేక గ్రామాల్లో రహదారుల పరిస్థితి అద్వాన పరిస్థితిగా దాపరించిందని అలాగే తుంగతుర్తి మండలం లో అనేక గ్రామాల్లో రోడ్లు బాగులేక కనీసం బస్సు సౌకర్యం కూడా లేకపోవడం విచారకరమని దీనిపై ఎమ్మెల్యే ఎలాంటి వివరణ ఇస్తారు అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.. శాలిగౌరారం మండలంలోని మానాయకుంట నుంచి చవుల్ల రామారం వరకు అలాగే హైవే రోడ్డుకు కూత వేటు దూరంలో ఉన్న ఇటుకుల పహాడ్ రోడ్డు కనీసం అభివృద్ధికి నోచుకోలేదని దుయ్యబట్టారు. రోడ్డే సరిగా వేయలేని ఎమ్మెల్యే పాలన ఏం చేస్తాడని నిలదీశారు. గత ప్రభుత్వాలను తిడుతూ కాలం వెళ్ళబుచుకోవడమేనా అంటూ అభివృద్ధి చేసేదేమైనా ఉందా అని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మహిళా అధ్యక్షురాలు తుంగతుర్తి ఎమ్మెల్యేగా అనేకసార్లు పోటీ చేసి ప్రజల బాధలను తెలుసుకొని ప్రశ్నించే తత్వాన్ని ఒక మహిళగా తునికి పుచ్చుకొని మహిళలతో నిలదీసే వరకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. ఇప్పటికైనా 8 నెలలు గడుస్తున్న మాట్లాడం చేసాం కాంట్రాక్టర్ దొరకట్లేదు అనే మాటలు పక్కన పెట్టి కచ్చితంగా రోడ్డును నిర్మించాలని ప్రజల ఇబ్బందులను తొలగించాలని బస్సు సౌకర్యాన్ని కూడా కలిగించాలని డిమాండ్ చేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకం

- స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమాలకు ఊపిరి పోసిన పూజ్య కొండా లక్ష్మణ్ బాపూజీ
- సమాజంలో అట్టడుగున నిలిచిన పేదల అభ్యున్నతికి కృషిచేసిన మహానేత కొండా లక్ష్మణ్
- రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 27 :**

నేటితరం యువతకు పూజ్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో అట్టడుగు నిలిచిన పేదల అభ్యున్నతికి ఆయన కృషి చేయగా, తెలంగాణ ఉద్యమంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అన్ని వర్గాలను చైతన్యం చేసినట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పూజ్య కొండాలక్ష్మణ్ బాపూజీ అని, తన ఇల్లు జలదృశ్యాన్ని ఉద్యమకారులకు అప్పగించగా, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సకల జనులను ఉద్యమం వైపు నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించినట్లు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమం తో పాటు ముల్కీ ఆందోళనలో పాల్గొన్న ఆయన వంటి మహనీయుడు దేశంలోనే చాలా అరుదని చెప్పారు. తెలంగాణ ప్రజలకు సంపూర్ణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఫలాలు అందిన నాడే నిజమైన నివాళి దక్కినట్లు అవుతుందని వివరించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఎవరిదీ పాపం.. ఎందుకీ శాపం?

కూల్చివేయాల్సిన వాటికి మార్క్ చేస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. 'నా భార్య 9 నెలల కడుపుతో ఉంది. ఇప్పుడు ఉన్నపళంగా వచ్చి మా ఇల్లు కూల్చేస్తే.. మేము ఎక్కడికి పోవాలి' అని ఆవేదన వ్యక్తం చేస్తూ.. చైతన్యపురిలో పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టా భూమిలోనే ఇల్లు కట్టుకున్నాం.. కరెంట్ బిల్లు, ఇంటి పన్ను అన్ని కడుతున్నామని వాపోయాడు. అయినా అతని ఇల్లు నిలబడటం లేదు. 'కనీసం నోటీస్ కూడా ఇవ్వకుండా ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారు.. ఏమైనా మాట్లాడితే కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ బుక్ చేస్తాం అంటున్నారు. ఇంట్లో ఆడవాళ్లు భయపడి.. బీపీ, షుగర్ పెరిగిపోతున్నాయి. కాళ్లు, చేతులు ఆడట్లేదు. ప్రశ్నిస్తే కేసు వేస్తామని జీప్ ఎక్కించడానికి లాక్కుపోతున్నారు' అని మరో బాధితుడు చెబుతూ.. కన్నీటి పర్యంతం అయ్యారు. 'మేం ఇంట్లోనే ఉంటాం. మా ఇల్లు కూలగొట్టి మమ్మల్ని చంపి మూసీ నదిలో పడేయండి. గత ప్రభుత్వం ఉన్నప్పుడే బాగుండే. రాత్రికి రాత్రి ఇళ్లకు మార్కింగ్ వేసి పోతున్నారు. అసలు నిద్రపోకుండా భయం భయంగా బతుకుతున్నాం' అని ఓ మహిళ గుండె బాదుకుంది. ఇన్నాళ్లు లేని సమస్య ఇప్పుడే ఎలా వచ్చిందని ప్రశ్నించింది. ఈ నెల 8న సున్నం చెరువు కూల్చివేతలతో అంజలి అనే మహిళ తన గుడిసెను కోల్పోయింది. అంజలి తన సోదరుడి ఇంటికి తల దాచుకోవడానికి వెళ్లి.. అక్కడే గుండె పోటుతో మృతి చెందింది. విజయ్ ప్రతాప్ గౌడ్ అనే వ్యక్తి.. రూ.50 లక్షలతో ఫుడ్ కేటరింగ్ పెట్టుకున్నాడు. 68 మందిని తన దగ్గర పనికి చేర్చుకున్నాడు. హైడ్రా కూల్చివేతలో తన కేటరింగ్ గోడౌన్ నేలమట్టం అయ్యింది. దీంతో రూ.50 లక్షలు నష్టం జరిగింది. 68 మంది ఉపాధి కోల్పోయారు. కడుపుతో ఉన్న తన భార్య రోదిస్తున్నా.. సామగ్రిని బయట పెట్టుకోడానికి అధికారులు సమయం ఇవ్వలేదని రవి అనే బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా హైదరాబాద్ నగరంలో ఎందరో కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇంకా కొందరైతే.. తమ కూల్చే సమయంలోనే.. తమను కూడా చంపేయండని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాము ఇంటి పన్ను, నల్లా పన్ను, కరెంట్ బిల్లు కడుతున్నామని బాధితులు చెబుతున్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తే.. ఇవన్నీ ఎందుకు చెల్లిస్తామని ప్రశ్నిస్తున్నారు. అప్పుడు అధికారులే అనుమతి ఇచ్చి.. ఇప్పుడు వారే కూల్చేస్తే ఎలా అని నిలదీస్తున్నారు. నిర్మాణం అక్రమం అయితే.. కట్టినప్పుడు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌లు కొన్నవారు దీనస్థితిలో ఉన్నారు. బిల్డర్ తమకు అమ్మితే కొనుక్కున్నాం.. ఇప్పుడు కూలిస్తే.. తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్ సి యం స్టోర్ ప్రారంభం

- చందంపేట ఎంపీపీ పార్వతి చేతుల మీదుగా ప్రారంభం
- నాణ్యమైన నిత్యవసర సరుకులు, అతి తక్కువ హోల్ సేల్ ధర



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ వినియోగదారులు దూర ప్రాంతాలకు వెళ్లి, రవాణా ఖర్చులు చేసి, ఇబ్బందులు పడే కంటే మన దేవరకొండ పట్టణంలోనే మహానగరాలకు దీటుగా ఆర్.సి.యం స్టోర్ లో అన్ని రకములైన నాణ్యమైన కిరాణా సరుకులు, నిత్యవసర సరుకులు సరసమైన హోల్సేల్ ధరలకు లభించడం శుభ పరిమాణం అని చందంపేట ఎంపీపీ పార్వతీ చందు నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిండి రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ఆర్ సి ఎం స్టోర్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టోర్ లో మెరుగైన, నాణ్యమైన సరుకులు అందించినప్పుడే అందరి మన్ననలు పొందవచ్చు అని అన్నారు. ఆర్.సి.యం స్టోర్ లో అన్ని ఆర్గానిక్ కిరాణా మరియు నిత్యవసర సరుకులు అతి తక్కువ ధరలో లభిస్తాయని, ఈ అవకాశాన్ని పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ ఆర్గానిక్ వాడకం వల్ల హ్యూమినిటీ పవర్ పెంచడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టోర్ యజమాని బట్టు శ్రీను మాట్లాడుతూ హనుమాన్ నగర్ మీనాక్షి ప్లాజా ఆవరణలో మా షాపు ప్రారంభించినాము మా వద్ద అన్ని రకముల కిరాణా వస్తువులు అతి తక్కువ హోల్సేల్ ధరల్లో లభిస్తాయని, మధ్యవర్తులు లేకుండా కంపెనీ నుండి డైరెక్ట్ గా కొనడం వల్ల మా వద్ద అన్ని నిత్యవసర వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు.

## చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యం

- ఉమ్మడి డివిజన్ స్థాయి పోటీలకు కుసుమణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ఎంపిక
- గ్రామస్థాయి నుండి జాతీయస్థాయికి ఎదిగి దేవరకొండకు మంచి పేరు తేవాలని పిలుపు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అండర్ 14 అండర్ 17 కబడ్డీ పోటీలకు డివిజన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి డివిజన్ స్థాయిలో కూడా గెలుపొంది ఆపై స్థాయిలకు చేరుకొని బహుమతులు గెలుపొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మీ ప్రదర్శనలు వెలికి తీసి భవిష్యత్తులో క్రీడారంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు వారి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పీఈటీ లు రజిత, రామచందర్ గెలుపొందిన విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని నింపుతూ క్రీడారంగంలో నైపుణ్యత పొంది చక్కటి ప్రదర్శనతో గెలుపొంది భవిష్యత్తులో క్రీడారంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్ గౌడ్ వైస్ ప్రిన్సిపల్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 27 :**



వర్గల్ మండలం అవుసులోన్పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట వారిచే పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ తో పాటు బెల్ట్,షూలను అందజేశారు. అలాగే బాగా చదివే విద్యార్థులకు 500 చొప్పున 2500 పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ గౌడ్, కనకరాజు, నరసింహారెడ్డి, స్వప్నప్రియ మరియు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అరుణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ,రమేష్, పిఆర్టియు వర్గల్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు వంటేరి నరసింహారెడ్డి, ప్రశాంత్ కుమార్, చేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిఆర్పి అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

## అవాలతో కొండ లక్ష్మణ్ చిత్రం

- ఘన నివాళులు అర్పించిన రామకోటి రామరాజు
- దేశం గర్వించదగ్గ నేత కొండ లక్ష్మణ్




**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 27 :**

ఉద్యమ శిఖరం,స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి సందర్భంగా వినూతంగా అవాలను ఉపయోగించి అత్యత అద్భుతంగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రాన్ని చిత్రించి శుక్రవారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ విముక్తికి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు, ఉద్యమ జీవి కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. గాంధీ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. దేశం గర్వించదగ్గ నేత. అయన కళలు కన్న ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని కోరారు.

## స్వచ్ఛభారత్ కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గర్ల్స్ జూనియర్ కాలేజీ కొత్త బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించి, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT, సభ్యులు, విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ బి ప్రవీణ్ సింగ్, కొండా నాయక్, విద్యార్థి సంఘం నాయకులు కలసి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, బస్టాండు ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ సంచులను బాటిల్స్ ఇతర ప్లాస్టిక్ కవర్లు ఏరి వేయడం జరిగింది. అధ్యక్షుడు NVT మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వల్ల పర్యావరణ వ్యవస్థ నాశనం అవుతుందని, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలకు అంతరాయం కలుగుతుందని, పర్యావరణం కలుషితమవుతుందని, నీరు గాలి భూమి కలుషితం అవుతుందని, మూగజీవాలు ప్లాస్టిక్ తినడం వల్ల ప్రాణాలు కోల్పోతాయని కాబట్టి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధించాలని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, తాళ్ల సురేష్, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్, వల్లమళ్ల ఆంజనేయులు, సతీష్‌గౌడ్, వంగూరు వెంకటేశ్వర్లు, డాన్స్ మాస్టర్ జగన్, గర్ల్స్ జూనియర్ కాలేజీ విద్యార్థినీలు క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## కాలనీల సమస్యలు తప్పక పరిష్కరిస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం కాప్రా డివిజన్ మెహెర్ బాబా కాలనీలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ వర్క్ వాళ్ళతో మాట్లాడి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో AE రోహిత్, BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ఇంద్రయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి వేడుకలు



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆయన స్వాతంత్ర సమరయోధుడు, అలాగే మన తెలంగాణ ఉద్యమకారుడు.. ఆయన పోరాట పటిమ మనందరికి దిక్సూచి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ త్రిలేశ్వర్ రావు, కార్పొరేటర్లు,కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ సాధారణ సర్వ సభ్య సమావేశం

- నగర మేయర్ అధ్యక్షతన సమావేశం
- 30 కోట్ల 55 లక్షల పనులకు ఏకగ్రీవ తీర్మానం




**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో సాధారణ సర్వసభ్య సమావేశం నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 30 కోట్ల 55 లక్షల అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తలను వేరుగా వేయండి

- కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్




**జయభేరి, మేడ్చల్ :**

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయడమే కాకుండా హానికరమైన పదార్థాలను మరో బుట్టలో వేసి పారిశుధ్యాన్ని పరిరక్షించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 13వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ మున్సిపల్ సిబ్బందితో కలిసి తడిచెత్త పొడిచెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి వేసేందుకు ప్రతి ఇంటికి రెండు చెప్పున చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బరినపడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడి కి జైలు శిక్ష

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 27 :**

వర్గల్ మండలం అంబర్పేట్ గ్రామంలో ఇండ్ల తాళాలు పగలగొట్టి దొంగతనం చేసిన విషయంలో నిందితుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు నాలుగు వేల రూపాయలు కోర్టు జరిమాన విధించిందని గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు. గత నెల 8 తారీఖున వర్గల్ మండలం అంబర్పేట్ గ్రామంలో పలు ఇండ్లలో తాళాలు పగలగొట్టి దొంగతనం చేశాడు. నిందితుడిని గత నెల 30 తారీఖున అరెస్టు చేసి రిమాండ్ పంపారు. అప్పటి నుండి కేసులో పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శుక్రవారం కేసు విచారణ కొనసాగి నేరం రుజువు అయినందున గజ్వేల్ న్యాయమూర్తి బి.ప్రియాంక నిందితుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు నాలుగువేల రూపాయల జరిమానా విధించారని గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు. నిందితుడిని త్వరగా పట్టుకొని శిక్ష పడేలా చేసిన ఎస్ఐని, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను పై అధికారులు అభినందించారని చెప్పారు.




# బాయ్ ఫ్రెండ్ కోసం శాఖాహారిగా మారిందట..!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు నటించిన టక్కరి దొంగ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీ సుందరి బిపాషా బసు. ఆ తర్వాత హిందీ సినిమాలకే పరిమితమైపోయింది. చివరగా వెల్ కమ్ టు న్యూయార్క్ సినిమాలో నటించిన ఈ భామ ఆ తర్వాత సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. చాలా రోజులుగా ఈ భామ నెట్టింట ప్రత్యక్షమైంది. ఓ ఆసక్తికర విషయాన్ని అందరితో షేర్ చేసుకుంది. తన బాయ్‌ఫ్రెండ్ కోసం పూర్తిగా శాఖాహారిగా మారిన విషయాన్ని చెప్పింది బిపాషా బసు. దీని గురించి మాట్లాడుతూ.. నేను స్కూల్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రేమలో పడ్డానని అమ్మతో చెప్పా. ఎదురుగా నిలబడి ఉన్న అమ్మ ఇది విని ఒక్కసారి స్పృహ తప్పి బెడ్ మీద పడిపోయింది. నువ్వేం చెప్పవా.. నాకు రెండు సల్వార్ కుర్తాస్ కావాలని అడిగా. అంతకంటే ముందు నేను షార్ట్స్ (పొట్టి డ్రెస్) వేసుకున్నా. అతడు మార్వాడి కుటుంబానికి చెందిన వ్యక్తి. అతని ఫ్యామిలీ ఇవాల్టి నుంచి నేను సల్వార్ కుర్తా వేసుకోవాలని అడిగారు.. నేటి నుంచి నేనిక శాఖాహారిని.. కానీ అంతకంటే ముందుకు నేను హార్డ్ కోర్ నాన్ వెజీరియన్‌ను అంటూ చెప్పుకొచ్చింది బిపాషా బసు. ఈ కామెంట్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ 2020లో క్రైం థ్రిల్లర్ Dangerousతో ఓటీటీలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత కొత్త ప్రాజెక్టులేమి ప్రకటించలేదు. మరి రానున్న రోజుల్లో బిపాషా బసు నుంచి ఏదైనా మూవీ అప్‌డేట్ వస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.



# రకుల్ ప్రీత్ సింగ్ సినిమా షూటింగ్ రద్దు..

కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీ భామ రకుల్ ప్రీత్ సింగ్. హీరోయిన్‌గా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో టాలీవుడ్‌లో మంచి బ్రేక్ అందుకుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ తెలుగు సినిమాలో కనిపించక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపైనే ఫోకస్ పెట్టింది. ఈ భామ అజయ్ దేవ్‌గన్, టబు ప్రధాన పాత్రలు పోషిస్తున్న దే దే ప్యార్ దే 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ కొన్ని రోజులుగా పాటియాలో జరుగుతుంది. అయితే అనుకోకుండా సినిమా షూటింగ్ రద్దయినట్టు ఓ వార్త బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం మూవీ డైరెక్టర్ అన్షుల్ శర్మ అస్వస్థతకు లోనవడంతో రెండు రోజులపాటు చిత్రీకరణ నిలిపేసినట్టు తెలుస్తోంది. అన్షుల్ వర్మ డెంగ్యూ అని నిర్ధారణ కాగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. అన్షుల్ శర్మ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సినిమా మరో నెలపాటు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. దే దే ప్యార్ దే 2 షూటింగ్ మళ్లీ నవంబర్‌లో మొదలు కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. రకుల్ ప్రీత్ సింగ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 3 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.





# రణబీర్‌కపూర్ రామాయణంలో పరశురాముడిగా ప్రభాస్?

పౌరాణిక పాత్రలకు సరిగ్గా సరిపోయే ఫిజిక్ ప్రభాస్‌ది. ఇప్పటికే ‘అదిపురుష్’లో రాముడిగా, ‘కల్కి 2898’లో కర్ణుడిగా కనిపించి ప్రేక్షకులను అలరించారాయన. త్వరలో రానున్న ‘కన్నప్ప’లో నందీశ్వరుడిగా కనిపిస్తారని టాక్ వినిపిస్తున్నది. ఇదిలావుంటే.. బీటౌన్‌లో ప్రభాస్‌కి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త బలంగా వినిస్తున్నది. ప్రభాస్ మళ్లీ రామాయణ కథలో నటించనున్నారట. వివరాల్లోకెళ్తే.. ప్రస్తుతం దర్శకుడు నితీశ్ తివారి ‘రామాయణం’ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అందులో రాముడిగా రణబీర్‌కపూర్ నటిస్తుండగా, సీతగా సాయిపల్లవి కనిపించనుంది. ఈ సినిమాలో సీతారాముల కల్యాణఘట్టాన్ని కన్నుల పండువగా తీయాలనే తలంపుతో ఉన్నారట నితీష్ తివారి. ఈ ఘట్టంలో పరశురాముడి పాత్ర చాలా కీలకం. ఆ పాత్రకోసం ప్రభాస్‌ని కలిశారట నితీశ్ తివారి. విష్ణుమూర్తి దశావాతారాల్లో రామావతారానికి ముందు వచ్చే అవతారం పరశురామావతారం. రాముడిగా రణబీర్‌కపూర్ చేస్తున్నప్పుడు, పరశురాముడిగా కూడా ఆ స్థాయి హీరో చేస్తే సబబుగా ఉంటుందని నితీశ్ భావించారట. దాంతో ఆయన ప్రభాస్‌ని కలిశారట. ప్రభాస్ కూడా పరశురాముడిగా నటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. దీనికి సంబంధించిన నిజానిజాలు ఇంకొన్ని రోజుల్లో వెల్లడి కానున్నాయి.

# జపాన్‌కు వస్తానని మహిళ అభిమానికి మాటిచ్చిన ఎన్టీఆర్..

టాలీవుడ్‌తో పాటు ప్రపంచమంతటా ప్రస్తుతం దేవర సందడి నెలకొన్న విషయం తెలిసిందే. ఆరేండ్ల తర్వాత ఎన్టీఆర్ సోలోగా రావడంతో అటు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ దేవర సినిమా చూసి సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా, కొరటాల శివ దర్శకత్వంలో ఈ సినిమా రాగా.. జాన్వీకపూర్ కథానాయికగా నటించింది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పించగా.. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుండగా.. అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక బియాండ్ ఫెస్ట్ వల్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. ఈనేపథ్యంలోనే బియాండ్ ఫెస్ట్ లో పాల్గొన్న ఎన్టీఆర్.. అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం తనని కలిసేందుకు వచ్చిన పలువురు అభిమానులతో ముచ్చటించారు. అయితే ఈ ఫెస్ట్‌లో ఎన్టీఆర్‌ను కలిసేందుకు ఒక మహిళ అభిమాని జపాన్‌లోని టోక్యో నుంచి జర్నీ చేసి లాస్ ఏంజెలిస్‌కు చేరుకుంది. బియాండ్ ఫెస్ట్‌వల్‌లో ఎన్టీఆర్‌ను కలుసుకుని మాట్లాడింది. అయితే తారక్‌ను చూడగానే ఒక్కసారిగా ఎమోషనల్ అయ్యింది ఆ అభిమాని. తారక్‌తో మాట్లాడుతూ.. మిమల్ని చూసేందుకు ఎంతోమంది అభిమానులు జపాన్‌లో ఎదురుచూస్తున్నారని.. తమ దేశానికి రమ్మని ఆహ్వానించింది. ఆమె మాటలకు ఎన్టీఆర్ ఆనందం వ్యక్తంచేశారు. తప్పకుండా వస్తానని మాటిచ్చారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com